# నిన్నటి కొడుకు

ఆరు నెలలు అమెరికాలో గడిపాక - ఇక వారం రోజుల్లో తిరుగు ప్రయాణం ఉందనగా - మా అబ్బాయి, కోడలు నన్ను 'బ్రిడ్జివాటర్' ప్రాంతంలో వున్న 'బాలాజీ' గుడికి తీసుకెళ్ళారు. తమిళులూ, తెలుగువారూ చాలా మంది ఆ గుడికి వస్తూంటారని మా అబ్బాయి చెప్పాడు.

'న్యూజెర్సీ' నించి ఓ గంట ప్రయాణం తర్వాత గుడికి చేరుకున్నాం. విశాలమైన ప్రాంగణంలో, ప్రశాంతమైన వాతావరణంలో చుట్టూ దట్టమైన వృక్షాల మధ్య ఉంది ఆలయం... కారు 'పార్క్' చేసిన తర్వాత అందరం లోపలకు వెళ్ళాం... ఎదురుగా నిలువెత్తున వెంకటేశ్వరస్వామి విగ్రహం కనిపించింది... దానికి ఇరువైపులా వేర్వేరు దేవతా మూర్తులకు ఏర్పాటు చేసిన చిన్నచిన్న మందిరాలు కూడా ఉన్నాయి... వాటన్నింటి చుట్టూ ఓసారి ప్రదక్షిణం చేసి - అందరితోపాటు, స్వామి విగ్రహం ముందు నేనూ వరుసలో నిలబడ్డాను. గర్భగుడిలో, అర్చకులు స్వామికి అభిషేకం చేస్తున్నారు.

"మళ్ళీ మా దేశానికి నన్ను క్షేమంగా చేర్చు స్వామీ!" అని మనసులోనే ప్రార్థించుకుని స్వామికి దణ్ణం పెట్టుకున్నాను... మరికొన్ని నిమిషాలకు అర్చకులు బయటికొచ్చి అందరికీ హారతి చూపించి, తీర్థం ఇచ్చి శఠగోపం తలపై ఉంచి ఆశీర్వదించారు.

ఆ తర్వాత మరో వరుసలో వెళ్ళి ప్రసాదం తీసుకుని ఆలయ ప్రాంగణంలోనే ఓ పక్కకు వెళ్ళి కూర్చున్నాను. అబ్బాయీ, కోడలూ నవగ్రహాలకు ప్రదక్షిణం చేసేందుకు వెళ్ళారు. ఇంతలో "హలో" అనే పలకరింపు వినిపించటంతో పక్కకు తిరిగి చూశాను... ఎవరో పెద్దాయన, నా దగ్గరగా వస్తూ కనిపించాడు. డబ్బయ్యేళ్ళ వయసుంటుందేమో! ఎప్పుడో ఎక్కడో ఆయన్ని చూసినట్టే అనిపించింది...

"నా పేరు నారాయణ! మీ పేరు తెలీదుగానీ... మీరు 'రేడియో స్టేషన్'లో పని చేశారనుకుంటాను... కరక్టేనా?" నా పక్కగా కూర్చుంటూ అడిగాడు. "అవునండీ! హైదరాబాద్ రేడియో స్టేషన్‌లో పని చేశాను. రిటైరై చాలా కాలమైంది. కానీ, నేను మీకు ఎలా పరిచయమో గుర్తుకు రావటం లేదు. మీరు ఎప్పుడైనా రేడియో స్టేషన్‌కి వచ్చారా?" అడిగేను. "లేదు సార్! మీరే మా ఊరొచ్చారు. ఎప్పుడో ముప్ఫయ్ రెండేళ్ళ క్రితం! అప్పటికీ, ఇప్పటికీ మీలో పెద్దగా మార్పు లేదు!" చెప్పాడాయన.

నేను రేడియోలో ఉద్యోగం చేసిన రోజుల్లో ఆ వృత్తి రీత్యా చాలా ఊళ్ళు తిరిగాను.

అందులో ఆయనది ఏ ఊరో మరి? ఆ వివరాలు అడగాలని అనుకుంటుండగా... ఆయనే మళ్ళీ అన్నాడు -

"అప్పట్లో మా 'దివిసీమ'లో పెద్ద ఉప్పెన వచ్చింది!"

నాకు వెంటనే జ్ఞాపకం వచ్చింది. ఆ సమయంలో నేను ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాలకు వెళ్ళి, తుఫాను బాధితుల్ని కలుసుకుని - వాళ్ళ కష్టనష్టాల్ని అడిగి తెలుసుకుని ఆ 'ఇంటర్వ్యూల్ని' రేడియోలో ప్రసారం చేశాను.

"అప్పుడే మీరు మా 'హంసల దీవి' కూడా వచ్చారు సారూ!... నా ఇంటర్వ్యూ కూడా తీసుకున్నారు. ఆనాటి ఉప్పెన, నా భార్యా పిల్లల్ని తన పొట్టన పెట్టుకుంది!" గతంలోకి చూస్తూ చెప్పాడు నారాయణ.

ఆ దుర్ఘటన జరిగి మూడు దశాబ్దాలు దాటిపోయినా దాని తాలూకు జ్ఞాపకాలు మాత్రం ఇంకా పచ్చిగానే ఉన్నట్టు, చెమ్మగిల్లిన ఆయన కళ్ళలోకి చూస్తూ గ్రహించాను.

ఆయన అపుడు చెప్పిన సంగతులన్నీ ఆ క్షణాన నా కళ్ళముందు నిలిచాయి. ఆ రోజు... పంథొమ్మిది వందల డబ్బయ్ ఏడో సంవత్సరం... నవంబరు పంథొమ్మిదో తేదీ...! చీకటి పడుతున్న సమయాన...!

ఆకలి గొన్న బకాసురునిలా ఆకాశం గర్జిస్తూంటే - సముద్ర తీరంలో ఉన్న ఆ గ్రామం మీదకు - వేడి నెత్తురు మరిగిన మృగరాజులా - సముద్ర కెరటాలు విరుచుకుపడ్డాయి... గాలీ, వానా కలిసి హెూరుమంటూ వచ్చాయి. అప్పటి వరకూ పొలంలో పని చూసుకుంటున్న నారాయణ - పెనుగాలికీ, జడివానకీ ఝుడిసిపోయి ఎక్కడిపని అక్కడే వదిలేసి ఇంటికొచ్చేశాడు. అప్పటికే పిల్లలిద్దరికీ అన్నం పెట్టి భర్త రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది చంద్రి.

"మళ్ళీ ఏంటి మావా? ఈ తుఫాను?" - చలిగాలికి బెదిరిపోతూ, పైట కొంగు మెడ చుట్టూ కప్పుకుని అడిగిందామె.

"సముద్ర తీరంలో - ఈ తుఫాన్లూ ఆటుపోట్లూ తప్పవులేవే! అయినా ఇది మనల్నేం చేస్తుంది? పొలాల్లో కూలి పని చేసుకునే వాళ్ళం... ఎక్కడ మన రెక్కాడినా, డొక్కాడుతుంది. పంటలున్న మా రాజులకైతే కంటతడి తప్పదేమో, కానీ మనకి భయం ఎందుకూ?' అంటూ భార్యకు ధైర్యం చెప్పాడు నారాయణ, కానీ, అతని లోని ఆ మనోధైర్యం ఎంతో సేపు నిలవలేదు. భార్యతో కలిసి అన్నం తింటుండగా వీధిలోకి వచ్చి చూశాడు నారాయణ.

అదే క్షణంలో ఆకాశం భీకరంగా ఉరిమింది. పడమటి దిక్కున శివధనుస్సు

ఫెళఫెళమని విరిగినట్లనిపించింది. ఎంత ముందుకొచ్చినా వెనక్కి మళ్ళిపోయే సముద్ర కెరటాలు వెల్లువలా ఊర్లోకి పొంగి వచ్చేశాయి. మిన్ను విరిగి మీద పడుతోందో, మన్ను కరిగి పాతాళానికి లాగేస్తోందో అక్కడి జనాలకు అర్థం కాలేదు. ఇళ్ళలోంచి మనుషులు రోడ్డు మీద కొచ్చి పరుగు తీస్తున్నారు... సముద్రం కట్టలు త్రెంచుకుని ఊళ్ళోకి వచ్చేస్తోందని అరుస్తున్నారు. హాహాకారాలు మిన్ను ముడుతున్నాయి...

అంతలోనే తానుంటున్న గుడిసెలాంటి ఇల్లు కూలిపోతోందని గ్రహించాడు నారాయణ. గబగబా లోపలకు వెళ్ళి పిల్లలిద్దర్నీ చెరో చంకనా ఎత్తుకున్నాడు. చంద్రిని వెంట రమ్మని రోడ్డున పడ్డాడు. ఊరి చివరి గట్టుమీద ఉన్న శివాలయంలోకి వెడితే తమకు మరి భయం ఉండదనుకున్నాడు. శివుడి అభయంతో నిర్భయంగా ఉండచ్చుననుకున్నాడే గానీ ఆ శివుడే తన గుడి వదిలి బయటికొచ్చి విలయ తాండవం చేస్తున్నాడనీ, ప్రళయ కావ్యం రాస్తున్నాడనీ ఊహించలేకపోయాడు.

గాలి తోసేస్తూంటే, వర్షం ఝుడిపిస్తూంటే - పిల్లలిద్దర్నీ చెరో భుజం పైనా వేసుకుని అడుగు లోతు నీళ్ళలో - నడవలేక నడవలేక నడుస్తున్నాడు నారాయణ. అంతవరకూ నీటి మట్టం పెరిగి ఆ ఊరే చెరువైపోతోంది... అతనిలాగే అందరూ ఎవరికి వారే ప్రాణ భీతితో పరుగులు తీస్తున్నారు...

అంతలోనే 'మావా' అంటూ వెనక నించి ఓ పొలికేక! నారాయణ నడుస్తూనే వెనుతిరిగి చూశాడు. పక్కనే నేలకూలిన తాటిచెట్టు... దాని కింద పడి గిలగిల తన్నుకుంటున్న చంద్రి! ఆమెను బయటకు లాగే ప్రయత్నం ఫలించలేదు. అతని కళ్ళముందే ఆమె కన్ను మూసింది. నారాయణ బావురుమన్నాడు. కానీ ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. ఎవరూ అతని కోసం రాలేదు. వస్తారని అతనూ అనుకోలేదు. పిల్లలనైనా కాపాడుకోవాలన్న తపనతో మళ్ళీ నడక సాగించాడు. మొలలోతు నీళ్ళలో నడవటం కష్టమైపోయింది. ఒక భుజం మీద కూర్చున్న రాజు భయంతో ఏడుస్తున్నాడు. రెండో భుజం మీదనున్న లక్ష్మి అమ్మ కావాలంటూ అరుస్తోంది. ఆ ఇద్దర్నీ పట్టించుకోకుండా తరుముకొస్తున్న మృత్యువునించి దూరంగా పారిపోయే ప్రయత్నంలో నడుస్తూనే ఉన్నాడు.

మరో మలుపు తిరిగితే శివాలయం! కానీ సుడిగాలి అతన్ని మలుపు తిరగనివ్వలేదు. చెట్టూ చేమా కూకటి వేళ్ళతో లేచిపోయి, నీళ్ళల్లో కూలిపోతున్నాయి. క్షణాల్లో నీటిమట్టం పెరిగిపోయింది. ప్రవాహ వేగం ప్రచండమైంది. భుజాల మీద పిల్లలు బరువెక్కిపోయారు. ఇక ఆ బరువుతో నీటిలో నడవటం అతనికి కష్టమైపోయింది. పక్కన కనిపించిన ఓ చెట్టుకొమ్మను ఆసరాగా పట్టుకున్నాడు. అది 'తుమ్మచెట్ట'ని అతనికి

తెలియలేదు. గాలి తాకిడికి కొమ్మనున్న ముళ్ళు సూదులుగా మారి అతని ప్రాణాల్ని గుచ్చేస్తుంటే విలవిల్లాడిపోయాడు.

క్షణాలు బరువుగా గడిచాయి. అంతలో కుడి భుజంపైన కూర్చున్న రాజు నెమ్మదిగా నీళ్ళలోకి జారిపోవటాన్ని గ్రహించాడు నారాయణ. వాణ్ణి ఆపటం, ఆదుకోవటం అతని వల్ల కాలేదు. మరి కొన్ని నిమిషాల్లోనే రాజు నీళ్ళలో మునిగిపోయాడు.

"అయ్యా!" - అనే వాడి దీనమైన పిలుపు నీటి ప్రవాహం వేగంలో, తుఫాను గాలి హెూరులో కలిసి పోయింది. నారాయణకి అప్పుడు ఏడుపు రాలేదు. అప్పుడే కాదు, "నేను బరువు లేనయ్యా... నన్ను వదలకయ్యా!" అంటూ రెండేళ్ళ లక్ష్మి, తన మెడను గట్టిగా పట్టుకుని ఒణికిపోతూ భయంతో అర్థించినపుడు కూడా అతనికి ఏడుపు రాలేదు.

అంతకంతకూ నీటి మట్టం పెరిగిపోయింది. తన కేదో అయిపోతోందని నారాయణ గ్రాహించాడు. కూతురు ఏమైపోతుందో అతను పట్టించుకోలేదు. కళ్ళు మూసుకుపోయాయి. మరుక్షణంలో స్పృహ కోల్పోయాడు.

మర్నాడు ఉదయం అతనికి స్పృహ వచ్చే సరికి - బారెడు పొద్దెక్కింది. మబ్బుని విడిచిన ఎండ మొండివాడి ధైర్యంలా విరగబడి కాస్తోంది. 'పీడకల' లాంటి వాస్తవాన్ని గుర్తు చేసుకుంటూ, ఆ వరదనీటిలో, బురద మేటలో ముందుకు నడిచాడు. చుట్టూ ఎటుచూసినా, కనుచూపు మేరలో అతనికి నీళ్ళే కనిపించాయి. ఆ నీళ్ళలో అడ్డదిడ్డంగా యుద్ధంలో మరణించిన సైనికుల్లాగా అస్తవ్యస్తంగా పడివున్న చెట్లూ, చేమలూ, జంతువుల కళేబరాలు... విరిగిపోయిన గోడలు... ప్రాణంలేని మనుషులూ... పగిలిన గోడలు... ఏడ్పులూ... పెడబొబ్బలూ... అంతే!

వాటి మధ్య తన చంద్రీ, రాజు, లక్ష్మి కాళ్ళకు తగులుతారేమోనని ప్రతి శవాన్నీ పరిశీలనగా చూస్తూ నడిచాడు నారాయణ. సూర్యుడు నడినెత్తి కొచ్చేదాకా నడిచాడు.

సరిగ్గా అదే సమయంలో ఎక్కణ్ణించో చిన్నగా ఏడుపు వినిపించింది. చుట్టూ చూశాడు. కొంచెం దూరంలో నేల కూలిన ఓ మామిడి చెట్టు కొమ్మల మధ్య నించి వినిపిస్తోంది. కాళ్ళకు సత్తువ తెచ్చుకుని అక్కడకు చేరుకున్నాడు నారాయణ. రెండేళ్ళయినా నిండని పిల్లాడు! కళ్ళు నలుపుకుంటూ ఏడుస్తున్నాడు. చుట్టూ ఎవరూ కనిపించలేదు. గబగబా ఆ పిల్లవాణ్ణి ఎత్తుకుని కళ్ళు తుడిచాడు. ఆ పిల్లవాడు నారాయణ వైపు భయంగా చూశాడు.

'భయపడకు బాబూ! నేను నీ అయ్యని! ఊరుకో ఏడవకు!" అంటూ వాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుని గుండెలకు హత్తుకున్నాడు నారాయణ.

ఆ తర్వాత నాలుగు రోజులకు - అక్కడి తుఫాను బాధితుల దయనీయ గాథల్నీ, అనుభవాల్నీ - రికార్డు చేసి 'రేడియో'లో ప్రసారం చేసేందుకు, నేను 'హంసల దీవి' గ్రామానికి వెళ్ళాను. అప్పుడే నారాయణ నాకు తారసపడ్డాడు. భగవంతుడు - తనకు చేసిన అన్యాయం గురించి - కళ్ళకు కట్టేలా వివరించాడు. తనకు దొరికిన ఆ పిల్లవాణ్ణి కూడా చూపించాడు.

"మరి ఈ పిల్లవాడి తల్లితండ్రులు మీకు కనిపించలేదా?" అని నేను ఆయనను అడిగాను.

"లేదు బాబూ! అన్నిచోట్లా వాకబు చేశాను. నేను ఆనాటి ఉప్పెనలో నా వాళ్ళను పోగొట్టుకున్నట్టే... వీడు కూడా తన తల్లితండ్రుల్ని దూరం చేసుకుని వుండాలి... మా బతుకులకు ఏదో 'పరమార్థం' ఉండి ఉండాలి" అన్నాడు నారాయణ.

అదీ ముప్ఫయ్ రెండేళ్ళ క్రితంనాటి గతంలో నారాయణ నాకు చెప్పిన కథనం!

ఇప్పుడు మళ్ళీ నారాయణ కనిపించగానే, అదంతా నాకు గుర్తుకొచ్చి వెనువెంటనే ఎన్నో సందేహాలు కూడా పుట్టుకొచ్చాయి.

'ఎక్కడో 'హంసల దీవి' గ్రామంలో... ఆనాటి ఉప్పెనలో సర్వస్వాన్నీ పోగొట్టుకున్న నారాయణ ఇప్పుడు ఈ అమెరికా దేశంలో ఎందుకున్నాడో?' 'ఒకవేళ తను చేరదీసిన ఆ పిల్లవాడు ప్రయోజకుడై - ఇక్కడే ఉద్యోగం చేసుకుంటూ నారాయణను తీసుకొచ్చి వుంటాడా? అప్పట్లో కూలిపని చేసుకుంటూ బతికిన నారాయణ ఆ పిల్లవాణ్ణి అంత ప్రయోజకుడిగా ఎలా చేయగలిగాడో?'

అన్నీ సందేహాలే!...

"అయితే... అప్పట్లో మీకు కనిపించిన ఆ పిల్లవాణ్ణి మీరు పెంచుకున్నారా?" అడిగాను.

"పెంచుకోవటమే కాదు సారూ! ఆనాటి తుఫానులో నా చేయి జారిపోయిన నా కొడుకు రాజును వాడిలోనే చూసుకుంటున్నాను. అదే పేరుతో పిల్చుకుంటున్నాను. చదువు సంధ్యలు చెప్పించాను. ఈ వయసులో ఇప్పుడు నాకు వాడే దిక్కయ్యాడు సారూ!" నారాయణ గొంతు గాద్గికమైంది. మాటల్లో ఉద్వేగం వినిపించింది. కళ్ళల్లో చెమ్మ కనిపించింది.

"ఇదేదో ఋణానుబంధం అనిపిస్తోంది నాకు! ఆ కుర్రాడికి మీరు ఏ జన్మలోనో ఋణపడి ఉంటారు. అందుకే ఈ జన్మలో అలా చేరదీసి ఈ విధంగా ఆ ఋణాన్ని తీర్చుకున్నారు!" అన్నాను అభినందనపూర్వకంగా.

"లేదు సారూ! రుణం 'నేను' తీర్చుకోవటం కాదు. ఏ జన్మలోనో 'వాడే' నాకు రుణపడి వుండాలి! అందుకే అప్పుడలా నా కంటపడ్డాడు. నా ఇంటికొచ్చాడు. నా ప్రాణానికి తన ప్రాణం పణంగా పెట్టాడు!" మళ్ళీ నారాయణ మాటల్లో అదే గాద్గదికం. కానీ ఆ స్వరంలో ఏదో కృతజ్ఞత...!

నాకర్థం కాలేదు. యింతలో చెంపల మీదకు జారిన కన్నీటి చుక్కను తుడుచుకుంటూ అతను మళ్ళీ చెప్పాడు -

"ఆరేళ్ళక్రితం నాకు చాలా జబ్బు చేసింది సారూ! గుంటూరులో నాకు వైద్యం చేసిన డాక్టర్లు నా రెండు కిడ్నీలు చెడిపోయాయని చెప్పారు. హైదరాబాదు వెళ్ళి వైద్యం చేయించుకోమన్నారు. అంతకు ఏడాది ముందే మా రాజు చదువు పూర్తి చేసుకుని ఈ దేశానికొచ్చి ఉద్యోగంలో చేరాడు. నా 'రోగం' గురించి చెప్తే 'ఉద్యోగం వదులుకుని వచ్చేస్తాడేమో, వాడి భవిష్యత్తు దెబ్బతింటుందేమో!' అని బాధపడ్డాను. అయినా తప్పలేదు. నేను చనిపోతే, నన్ను కాటికి పంపాల్సింది, కర్మ చేయాల్సింది వాడే కదా? అందుకే ఫోన్ చేసి చెప్పాను. వాడు వెంటనే వచ్చి నన్ను హైదరాబాద్ తీసుకెళ్ళి ఆస్పత్రిలో చేర్పించాడు. కనీసం ఒక 'కిడ్నీ' అయినా ఎవరో ఒకరు దానం చేస్తే నేను మరికొంత కాలం బ్రతికే అవకాశం ఉంటుందని డాక్టర్లు చెప్పారు. కానీ ఎవరిస్తారూ? పైగా వయసైపోయినవాణ్ణి. నా స్వార్థానికి మరొకరి ఆరోగ్యాన్ని పణంగా పెట్టమని ఎవర్నడగాలి? అందుకే... త్వరగా ప్రాణం పోతే చాలని దేవుణ్ణి ప్రార్థించాను. "ఇంతలో నాకు తెలియకుండా మా వాడు వైద్య పరీక్షలు చేయించుకుని వాడి 'కిడ్నీ'ని నాకు అమర్చేలా ఏర్పాటు చేశాడు. ఆ విషయాన్ని డాక్టరు గారు చెప్పినపుడు ముందు ఆశ్చర్యపోయాను. తర్వాత బాధ పడ్డాను. ఆ తర్వాత వాణ్ణి కోప్పడ్డాను. అలా చేయవద్దని వారించాను. అయినా వాడు వినలేదు!"

వృద్ధాప్యానికి చేరుకున్న తల్లితండ్రులు బరువనుకుని, వాళ్ళను వృద్ధాశ్రమాలకు అంకితం చేసే కొడుకులున్న ఈనాటి సమాజంలో తండ్రి కోసం తన శరీరంలోని ఒక భాగాన్ని సైతం త్యాగం చేసిన ఆ 'పెంపుడు కొడుకు'ను చూడాలనిపించింది...

"మీ అబ్బాయి ఏడీ? గుడికి రాలేదా?" అడిగాను.

"వచ్చాడు సారూ! ఆరేళ్ళ క్రితం నాకు అలా సుస్తీ చేసింది కదా! నా ఆరోగ్యం చక్కబడి, నేను మళ్ళీ మామూలు మనిషినైతే ఈ గుడికి తీసుకొచ్చి దర్శనం చేయిస్తా'నని మొక్కుకున్నాట్ట! అందుకే నాకు ఇష్టం లేకపోయినా... నాలుగేళ్ళుగా పోరుపెట్టి చివరకు వాడి ఫ్రెండెవరో అమెరికా వస్తుంటే అతనితో నన్ను ఇక్కడకు రప్పించాడు. ఇవాళ

గుడికి తీసుకొచ్చాడు. దర్శనం చేసుకుని, ఇంతకు ముందే ప్రసాదాలు కొనుక్కొస్తామంటూ పెళ్ళాన్నీ, పిల్లల్నీ వెంట బెట్టుకుని వెళ్ళాడు!" చెప్పాడు నారాయణ.

సరిగ్గా అప్పుడే మూడేళ్ళ పాప అతని దగ్గర కొచ్చింది. "గ్రాండ్ పా! మీరిక్కడున్నారా? మీ కోసం మేం ఎంత వెతికామో!" అంటూ అతని చేయిపట్టుకుంది. "నా మనవరాలు! పేరు చంద్రలేఖ. దీని తర్వాత మగ పిల్లాడు" ఆ పాపను నాకు పరిచయం చేస్తున్నట్టుగా చెప్పాడు నారాయణ.

"హాయ్ బేబీ! యూ ఆర్ వెరీ క్యూట్!" అన్నాను ఆ పాప చేయి పట్టుకుని. "మా తమ్ముడు నా కంటే క్యూట్! వాడి పేరు రామ్ నారాయణ్. రాముడు 'గాడ్' కదా... ఆ పేరూ మా 'గ్రాండ్ పా' పేరూ కూడా కలిపి పెట్టారు మా డాడీ! ఇక మా 'గ్రాండ్ మా' పేరేమో నాది!" ఎంతో ఉత్సాహంగా మరెంతో గొప్పగా చెప్పింది పాప. అంతలో నారాయణ కొడుకు, కోడలూ వచ్చారు. కొడుకు తన పిల్లవాణ్ణి ఎత్తుకున్నాడు. వాళ్ళను నాకు పరిచయం చేసి, తన కొడుక్కి నా గురించి చెప్పాడు నారాయణ. అతను మర్యాదపూర్వకంగా 'హలో' అంటూ నన్ను పలకరించాడు. "మీ గురించి ఇంతకు ముందే మీ నాన్న గారు చెప్పారు... ఆయనకు మీ 'కిడ్నీ' డొనేట్ చేశారట కదా!... యూ ఆర్ గ్రేట్!" అన్నాడు నా చేయి కలుపుతూ, అభినందన పూర్వకంగా.

"అది డొనేషన్ ఎందుకవుతుంది సార్? కొడుగ్గా నా బాధ్యత! మీకు తెలీదు. నడిరోడ్డు మీద బడ్డీకొట్టు పెట్టుకుని పొద్దున పూట ఇడ్లీలు, సాయంత్రం పూట మిర్చీ బజ్జీలూ వేసి అమ్ముకుంటూ రూపాయి రూపాయి కూడబెట్టి, నన్ను చదివించారు. పండగొస్తే తను ఓ పంచె కొనుక్కోకపోయినా నాకు మాత్రం కొత్త బట్టలు కుట్టించే వారు. ఇవాళ నేను ఈ స్థితికొచ్చానంటే అదంతా నాన్నగారి కష్టానికి ఫలితమే అనుకుంటాను. నా కోసం ఆయన చేసిన త్యాగానికి నేను ఎంత చేసినా తక్కువే కదా?"

అతనలా చెప్తుంటే మంత్రముగ్ధుడిలా చూశాను. ఇంతలో నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణం చేసి, మా అబ్బాయీ, కోడలూ కూడా వచ్చారు. పరస్పర పరిచయాలు పూర్తయ్యాక అతనూ, మా అబ్బాయీ తమ తమ ఉద్యోగాల గురించి మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత, అక్కణ్ణించి బయల్దేరుతూ పర్సులోంచి తన విజిటింగ్ కార్డు తీసి మా అబ్బాయికి అందించాడు రాజు. "మీ నాన్న గారు ఇండియా వెళ్ళేలోగా ఓ 'ఈవినింగ్' మా ఇంటికి మీ రంతా కలసి 'డిన్నర్'కి రావాలి!" అంటూ ఆహ్వానించాడు. మేమంతా ఆలయంలోంచి బయటకొచ్చాం.

నేను మా అబ్బాయి తెచ్చిన కారు దగ్గరకు నడుస్తుంటే నారాయణ హడావిడిగా నా దగ్గరకొచ్చాడు. 'సారూ! నాదో చిన్న రిక్వెస్టు!'' అన్నాడు.

''చెప్పండి!''

''ఆనాటి ఉప్పెనలో - తన వాళ్ళను పోగొట్టుకుని ఓ అనాధలాగ, నాకు కనిపిస్తే నేను చేరదీసి పెంచిన విషయం మా వాడికి తెలియదు. ఒకవేళ మీరు మా ఇంటికొస్తే మాటల సందర్భంలోనైనా ఈ సంగతి ప్రస్తావించకండి!'' అన్నాడు నా చేయి పట్టుకుని.

నేను ఆశ్చర్యపోయాను. ఇంతటి ముఖ్యమైన విషయాన్ని అతనికి చెప్పకుండా ఇంతకాలం ఎలా దాచగలిగాడో, అసలు ఎందుకు దాచవలసి వచ్చిందో నాకు అర్థం కాలేదు. పైగా అతనికి తెలిస్తే ఇంకా సంతోషించి, ''ఆ తండ్రిపట్ల మరింత కృతజ్ఞత చూపించేవాడు కదా'' అనిపించింది. ఆ సంగతే అన్నాను.

''మీరన్నది నిజమే సారూ! కానీ ఈ విషయం వాడికి చెప్పాల్సిన అవసరం మొదట్లో రాలేదు. ఆ తర్వాత ఎప్పుడైనా చెప్పాలని అనిపించినా, చెప్తే పెంపుడు తండ్రిగా నా పట్ల గౌరవం తగ్గిపోవటం సంగతి అటుంచి, 'తన తల్లిదండ్రులు ఎవరో... ఎక్కడైనా వున్నారేమో' అనే ఆలోచనలతో చదువుని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తాడోనని భయం వేసింది. ఇక ఎప్పుడైతే తన 'కిడ్నీ' నాకు ఇచ్చాడో - అప్పుడిక ఈ జీవితంలో ఆ రహస్యాన్ని బయటపెట్టకూడదనీ, అది నా తోనే అంతరించి పోవాలనీ నిర్ణయించుకున్నాను!''

''అంటే...?'' అర్థం కాలేదు నాకు. ''పెంచి పెద్ద చేసినంత మాత్రాన ఓ పరాయి వ్యక్తికెవరికో, విలువైన తన కిడ్నీని ఎందుకిచ్చానా?'' అని బ్రతికినంతకాలం వాడు బాధపడతాడేమో నన్న భావన కలిగింది. ఈ వయసులో అదీ నేను భరించలేను. ప్రస్తుతం తండ్రీ కొడుకులుగా మేం హాయిగానే ఉన్నాం. హాయిగానే ఉండాలి. అంతే!'' అంటూ నా చేయి వదిలి ఓ మరమనిషిలా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు నారాయణ.

నేను దిగ్భ్రాంతిగా అటే చూస్తుండిపోయాను..... వాళ్ళ కారు నా కను చూపుల నించి కనుమరుగయ్యేదాకా!!

*నవ్య, 2010 దీపావళి సంచిక*

★ ★ ★